అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# ప్రతిఫలం

## "యాదవ్ ప్రిన్సిపాల్‌ని కొట్టాడట."

-ఎస్.కె. షానావాజ్

"యాదవ్ ప్రిన్సిపాల్‌ని కొట్టాడట", ఆ వార్త ఆ కాలేజ్ అంతా దావానలంలా వ్యాపించింది.

స్టాఫ్‌రూమ్‌లో లెక్చరర్స్‌అంతా ఈ విషయం గురించే చర్చించుకుంటున్నారు.

"మంచితనానికి మారు పేరు అ కాలేజీ ప్రిన్సిపాల్ గారు, అటువంటి వ్యక్తిని కొట్టడానికి ఆ దౌర్భాగ్యుడికి చేతులెలా వచ్చాయి, వీడి దౌర్జన్యాలకు ఈ మధ్య హద్దు లేకుండాపోతోంది." అందరి స్వరాల్లోనూ ప్రిన్సిపాల్‌ని కొట్టిన యాదవ్ పట్ల ఈసడింపే ధ్వనిస్తోంది.

కాని యాదవ్‌కు మాత్రం చీమకుట్టినట్టయినా లేదు. తన అహంకారానికి ఇదొక నిదర్శనమన్నట్టు గర్వంగా ఉన్నాడు.

ప్రిన్సిపాల్‌గారు వాడి మీద ఇంకా ఏ యాక్షన్ తీసుకోలేదు.

ఆ తర్వాత ప్రిన్సిపాల్‌గారి ఆదేశం మేరకు లెక్చరర్లంతా స్టాఫ్ రూమ్‌లో ప్రత్యక్షమయ్యారు. సూది పడిన వినపడేటంత నిశ్శబ్దం. "వాట్ ఈజ్ దిస్ నాన్‌సెన్స్." ఇంకా ఆ రాస్కెల్ మీద ఏ యాక్షన్ తీసుకోలేదంటే మాకు చాలా అవమానంగా ఉంది." అంటూ అక్కడి నిశ్శబ్దాన్ని



భంగపరుస్తూ ఇంగ్లీష్ లెక్చరర్‌గారి కంఠం గంభీరంగా వినబడింది. "అవున్సార్ ఈ రోజు మిమ్మల్ని కొట్టాడు. రేపు మా అందర్నీ కొడ్తాడు. ఇలాగే మనం ఊరుకుంటే, ఈ కాలేజ్‌కు ప్రిన్సిపాల్ మీరు కాదు, వాడవుతాడు" అంటూ మరో లెక్చరర్ వంతపాడాడు.

ఏం చెప్పాలో ప్రిన్సిపాల్‌గారికి అర్థం కాలేదు. "ప్లీజ్ ట్రై టు అండర్‌స్టాండ్ మై పొజిషన్"

నిజమే... మీరన్నట్టు వాణ్ణి సస్పెండ్ చెయ్యాల్సిందే, కాని తరువాత ఏం జరుగుతుందో అది కూడా మనమే ఆలోచించాలి." "ఏమిట్సార్ మీరనేది... ఒక విద్యార్థి దౌర్జన్యానికి మీరు లొంగిపోతున్నారా... లెక్చరర్స్ అంతా నిలదీశారు. "లేదు వాడి బెదిరింపులకు నేను భయపడటం లేదు, వాడి వెనుక ఉన్న ఆ ఎమ్.ఎల్.ఎ. కొడుకు జనార్ధన్.

వాడి సపోర్టువల్లనే వీడు ఈ విధంగా ఎగురుతున్నాడు. డబ్బు, పలుకుబడీ వాడి చేతుల్లో వున్నాయి. ఒకవేళ యాదవ్‌ను మనం సస్పెండ్ చేశామో, ఇక కాలేజ్‌లో గందరగోళాలు ప్రారంభమవుతాయి, సమ్మెలూ, హత్యలూ, నిరాహారదీక్షలని కాలేజిని భ్రష్టు పట్టిస్తారు."

జరగబోయే దారుణాల గూర్చి ఒక్కమారు చెప్పారు ప్రిన్సిపాల్‌గారు.

"అంటే జనార్ధన్‌కు భయపడి యాదవ్‌లాంటి రౌడీ విద్యార్థి దౌర్జన్యాలను సహిస్తూ, ఇలానోరు మూసుకోనుండాల్సిందేనా..." లెక్చరర్స్ అడిగారు.

ప్రిన్సిపాల్‌గారి ఆదేశం మేరకు, జనార్ధన్ తన గ్యాంగ్‌తో స్టాఫ్ రూమ్‌లో ప్రత్యక్షమయ్యాడు.

జనార్ధన్ అంటే కాలేజ్ అంతా గడ గడ లాడుతుంది. అతడికి కుడి భుజం లాంటివాడే యాదవ్. జనార్ధనే యాదవ్ దౌర్జన్యాలకు నాంది పలికేది.

"ఏమిటిదంతా అన్నట్టు" ప్రిన్సిపాల్‌గారు జనార్ధన్ వైపు చూశారు.

"ఏరా యాదవ్ ప్రిన్సిపాల్‌గారిని కొట్టావట" ఏమీ తెలియనట్టు తన గ్యాంగ్‌లో ఉన్న యాదవ్ వైపు చూస్తూ అన్నాడు జనార్ధన్.

"అవును గురూ కొట్టాను..."

"అదే ఎందుకు కొట్టావు."

అదా... ఏం లేదు గురూ... ఈ రోజు మన కాలేజీలో ఎవరో ఒక న్యూ క్యాండెట్‌ను చూశాను. ఫిగరు సూపర్‌గా ఉంది.

తెలుగు సినిమాలో విలన్‌లా ఓ చిన్న ఈల వేశాను. అంతే అది నా వైపు ఉరిమిచూసింది. అందమైన ఆడపిల్ల ఉరిమి చూస్తే నేను ఊరుకొంటానా?

విసురుగాపోయి దాని జడను పట్టుకొని వెనక్కు లాగాను. అది ఏడుస్తూపోయి ప్రిన్సిపాల్‌గారికి రిపోర్ట్ చేసింది. అదేదో తెలియక చేసిందనుకో, వీడి బుద్ధి గడ్డి తిందా... నన్ను పిలిపించి నానా విధాలుగా తిట్టాడు. అంతే నాకు కోపం వచ్చింది. తరువాత నీకు తెలిసిందేగా" అంటూ ప్రిన్సిపాల్‌గారి వైపు వ్యంగ్యంగా చూస్తూ చెప్పాడు యాదవ్.

"శభాష్‌రా శిష్యా, మంచిపనేచేశావు. మన గురించి ఇంకా తక్కువ అంచనా వేస్తున్నాడు ప్రిన్సిపాల్. గురువును మించిన శిష్యుడు అనిపించు కొన్నావు. అంటూ యాదవ్‌ను ఎంకరేజ్ చేసెటట్టుగా భుజం తట్టాడు జనార్ధన్.

ప్రిన్సిపాల్‌గారి మనస్సు చివుక్కుమంది కాని ఏమీ చేయలేకపోయారు. అంతా వింటోన్న లెక్చరర్స్ వస్తోన్న ఆవేశాన్ని అణగదొక్కుకున్నారు.

అర్థరాత్రి సమయం, సుమారు పన్నెండు కావస్తోంది. మెల్లగా అడుగులు వేసుకొంటూ వస్తున్నాడు యాదవ్.

"ఆగు" అన్న శబ్దాన్ని విని, ఇంట్లోకి జారబడుతున్న కాళ్ళు తక్కున ఆగిపోయాయి.

ఎదురుగా సింహంలా నిలబడి ఉన్న తన తండ్రిని చూసి గతుక్కుమన్నాడు యాదవ్.

"ఏరా... ఇప్పుడా ఇంటికొచ్చేది. టైమెంతో తెలుసా..." కొడుకు వైపు ఉరిమి చూస్తూ గర్జించాడు నారాయణ.

"ఈ రోజు కాలేజ్‌లో ఫంక్షన్..." అంటూ ఏదో చెప్పబోతున్నాడు యాదవ్.

"నోర్ముయ్‌రా నువ్వు ఈరోజు కాలేజ్‌లో ఏం ఘన కార్యం చేశావో నాకంతా తెలుసు. నిన్ను నా కొడుకుఅని చెప్పుకోవటానికి కూడా నాకు ఎంతో సిగ్గుగా ఉంది. ఛ.. ఎందుకురా నీ బ్రతుకు." ఆవేశంగా కేకలేస్తున్నాడు నారాయణ.

ఏమిటో ఈ గలభా అన్నట్టు నిద్రాభంగమైన సావిత్రి హడావిడిగా హాల్లోకిపరుగెత్తి వచ్చింది. "ఏమిటండీ ఇదంతా" అడిగింది తండ్రి కొడుకులవైపు ఆశ్చర్యంగా చూస్తూ...

"నీ కొడుకు ఈరోజు కాలేజీలో ఏం చేశాడో వాణ్ణే అడగవే."

"ఏరా... ఏం చేశావురా? ఎందుకురా మమ్మల్నిలా బాధపెడ్తావు. ఒక్కసారి మా ఇద్దరికి విషమిచ్చేసి ఆ తరువాత నీఇష్టమొచ్చినట్లు చేసుకో."

"ఈ రోజు ప్రిన్స్‌పాల్‌ను కొట్టాడు. ఆ ఎమ్.ఎల్.ఎ కొడుకుతో తిరుగుతూ కాలేజిలోనే కాదు, ఈ సిటీలో జరిగే ప్రతి దౌర్జన్యానికి ముందుంటాడు. ఇక వీడు ఆ కాలేజిలో చదవటానికి వీల్లేదు." అంటూ కేకలు వేశాడు నారాయణ.

యాదవ్ చదువుకు ఫుల్‌స్టాప్ చెప్పించేశాడు నారాయణ.

"కూటి కోసం కోటి విద్యలన్నట్టు. మనిషి గౌరవంగా బ్రతకాలంటే ఈ సంఘంలో ఏదో ఒక పని చేయాలి. ఇది ప్రతి మానవుడి కర్తవ్యం. ఈ విషయం మనకందరికీ తెలిసిందే" అంటూ


నారాయణ తనకు తెలిసిన ఓ క్లాత్ షోరూమ్‌లో తన మంచితనాన్ని అడ్డుగాపెట్టి, యాదవ్‌కు ఏదో చిన్న ఉద్యోగం ఇప్పించాడు.

ఏదో ఒక రకంగా తన కొడుకు దారికొస్తాడనుకొన్నాడు నారాయణ. కాని అతని ఆశలు ఊహాలోకానికే పరిమితమయ్యాయి. "గుప్పెట్లో నీళ్ళుపోస్తే ఉంటాయా. అలాంటిదే యాదవ్ బుద్ధికూడా.

ఆ ఉద్యోగానికి ఒక సెల్యూట్‌కొట్టి వెళ్ళిపోయాడు పోదు వాడేమన్నా... ఒట్టి చేతుల్తో పోయాడా? లేదు. ఆ షాపులోని పదివేల రూపాయలను స్వాహా చేసుకొని పారిపోయాడు

## పరిచయం

పేరు : ఎస్.కె.షానావాజ్
విద్యార్హతలు: డి.ఇ.ఇ.ఇ.(డిప్లొమా)
పుట్టినతేది : 17-03-1972
గ్రామం : చిన్నపడుగుపాడు,నెల్లూర్-జిల్లా.



అడ్రస్:
ఎస్.కె.షానావాజ్
చిన్నపడుగుపాడు
కొవ్వూర్ - మండలం
నెల్లూర్ - జిల్లా.

ఆ షాపు యజమాని లబో-దిబో మంటూ నారాయణ ఇంటి మీదకొచ్చాడు.

"ఏమయ్యా పెద్ద మనిషి ఏదో గౌరవంగా బ్రతికే కుటుంబంకదా అని నిన్ను చూసి నీ కొడుక్కి ఉద్యోగం ఇస్తే వాడు ఇంత పనిచేస్తాడా. నా కొంప ముంచేశాడు కదయ్యా... ఒకటి రెండు కాదు. పదివేలు కాజేశాడు పిల్లల్ని పందులు కూడా కంటాయి... అది గొప్ప కాదు. వాళ్ళను ఒక సక్రమమైన మార్గంలో పెంచాలి. అదే మానవజాతి లక్షణం.

కొడుకును ఇలా గూండాగా తయారుచేసి, ఊరి మీదకు వదిలే నువ్వు ఒక మనిషేనా... ఛీ..." అంటూ ఆ షాపు యజమాని నారాయణ ఇంటి ముందుచేరి పది మందికి తెలిసేటట్లు, ఉగ్రనరసింహుడిలా కేకలు వేశాడు. అతడి మాటలు నారాయణ, సావిత్రుల గుండెల్లో ఈటెల్లా గ్రుచ్చుకున్నాయి.

అంతమంది ముందు నారాయణకు తల తీసేసి నట్లయింది. ఒళ్ళంతా చెమటలుపట్టి వణుకుతూ నేల మీదకు ఉప్పగా కూలిపోయాడు.

వెంటనే అతణ్ణి హాస్పిటల్‌కు తరలించారు. అన్ని పరీక్షలు చేసిన డాక్టర్లు, నారాయణకు గుండెపోటు అని చెప్పారు. ఇక అతడు బ్రతకటం అసాధ్యమని పెదవి విరిచారు డాక్టర్లు.

ఎమర్జెన్సీ వార్డులో నారాయణ మృత్యువుతో పోరాడు తున్నాడు. ఈ పోరాటంలో నారాయణ గెలవటం అసంభవం అని అందరికి తెలుసు.

"నారాయణా... నారాయణా... ఎవరొచ్చారో చూడు..." అన్న శబ్దంవిని, నీరసంగా కళ్ళు తెరిచాడు నారాయణ.

ఎదురుగా రెండు ఖాకీ ఆకారాల మధ్య కంటినిండా తడితో తండ్రివైపు దీనంగా చూస్తున్నాడు యాదవ్.

కొడుకును చూసిన నారాయణకు సంతోషించాలో, బాధపడాలో అర్థం కాలేదు. నీరసంగా నోరు విప్పాడు.

"ఏరా నేను పోతున్నానని తెలిసి నన్ను చూడటానికి వచ్చావా... మంచి పని చేశావురా... నా కడ సారి కోరికైనా తీర్చావు. ఇప్పుడైనా తల్లితండ్రులున్నారని గుర్తుకు తెచ్చుకున్నందుకు చాలా సంతోషం. అంతేచాలు" లేని బలాన్ని కూడగట్టుకొని మరీ మాట్లాడుతున్నాడు.

"సార్ నా కొడుకుతో మనసు విప్పి మాట్లాడ్డానికి అనుమతిస్తే..." అంటూ పోలీసులిద్దరి వైపు కంటినిండా తడితో చూశాడు నారాయణ.

"సరేనన్నట్టు... ఇద్దరు కానిస్టేబుల్స్, నారాయణ, యాదవ్‌లను ఏకాంతంగా వదిలి వెళ్ళిపోయారు.

తండ్రి దీనావస్థను చూసి యాదవ్ కళ్ళలోనించి నీళ్ళు జల - జలా రాలాయి.

• "ఆరిపోతున్న దీపాన్ని చూసి... ఇంకా ఏడుస్తా వెందుకురా? నా ఆఖరి సారైనా నిన్ను చూసినందుకు నా మనస్సు ఆనందంతో నిండిపోయింది.

అలా కూర్చో... నా మనసులో దాగిన ఓ నిజాన్ని నీతో చెప్పాలను కొంటున్నాను.

ఇన్నాళ్ళూ, ఈ చేదు నిజాన్ని నా గుండెల్లోనే దాచుకున్నాను.

ఇప్పటికైనా నా గత జీవితం గూర్చి నీకు చెప్పకపోతే ఓ తండ్రి ఓ కొడుకును ఇంకా అంధకారంలో ఉంచినట్టవుతుంది.

అందుకే నా జీవితం గురించి చెప్పాలనుకుంటున్నాను.

నేను ఓ మారుమూల పల్లెటూరులో ఒక పేద రైతు కుటుంబంలో జన్మించినవాణ్ణి.

కాని నా తల్లిదండ్రులు, వాళ్ళ బ్రతకుల్లాగే నా బ్రతుకు మట్టి పిసకటానికి అంకితం కాకూడదని, నన్ను ఎంతో అల్లారు ముద్దుగా పెంచారు.

పై చదువుల కోసం తమ కడుపు కాల్చుకొని నన్ను పట్టణానికి పంపారు.

నేను కూడా నీలాగే కాలేజీ చదివే రోజుల్లో ఏ ఒక్క రోజుకూడా కాలేజీకు పోయేవాణ్ణి కాదు. ఎప్పుడూ సినిమాలూ, షికార్లూ అంటూ జీవితం అంతా ఎంజాయ్ చేయటమే.

చెడు స్నేహితులతో విచ్చలవిడిగా తిరిగేవాణ్ణి. రాను. రాను నాకు ఇంటినుంచి వచ్చే డబ్బు నా దుర్వ్యసనాలకు సరిపోయేది కాదు. ఎలాగైనా డబ్బు సంపాదించాలి అన్న ఆశతో ఉన్న నాకు ఓ ఫ్రెండ్ సలహా మేరకు 'దుబాయ్' వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను.

కాని అది చాలా ఖర్చుతో కూడినపని, ఎలాగైన్నా నా తల్లిదండ్రులకు మస్కా కొట్టి డబ్బు గుంజాలనుకొన్నాను. నాకు ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చిందని. అందుకు ఇరవై వేలు డొనేషన్ కట్టాలని అబద్ధమాడాను.

తమ కొడుకు ఇంజనీరు అవుతాడంటే, అంతకన్నా అదృష్టం వేరేదేముంది. నా తల్లిదండ్రులు ఎంతగానో ఉప్పొంగి పోయారు.

నిలువ నీడగా ఉన్న తమ సొంతయింటిని కొడుకు భవిష్యత్తుకోసం అమ్మేసినారు. నా ప్లాన్ సక్సెస్ అయి నందుకు నేను ముందు ఎంతగానో మురిసిపోయాను.

దుబాయ్ కెళ్ళాలని పగటి కలలు కంటున్న నాకు ఎవరో బ్రోకర్ నన్ను బొంబాయిలో వదిలేసి ఇరవైవేలతో పరారయ్యాడు.

కన్నతల్లిదండ్రులను మోసం చేసిన నాకు విధి మంచి గుణపాఠం నేర్పింది. అంతా తెలిశాక నా తల్లిదండ్రులు కృంగిపోయారు. నా గురించి ఎంతగానో ఆశించారు. కాని వారి ఆశాదీపాలను ఆర్పివేసిన దౌర్భాగ్యుణ్ణి నేను.

ఈ రోజు నాకు ఒక కొడుకు పుట్టాక. తల్లిదండ్రులు తమకన్న బిడ్డల భవిష్యత్తు కోసం ఎలా ఆరాటపడతారో ఇప్పుడు తెలిసింది.


ఆరోజు నేనుచేసిన పాపానికిప్రతిఫలమేరా నువ్వు..."

నారాయణకు మాటలాడే శక్తి సన్నగిల్లింది. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. డాక్టర్లంతా హడావిడిగా పరిగెత్తారు.

కాని అప్పటికే నారాయణ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోయాయి.

ఎస్కె. షాన్‌వాజ్,
సన్నాఫ్ ఎస్కె. దస్తగిరి, లైన్ మెన్ (ఎ.పి.ఎస్.ఇ.బి.)
చిన్నపడుగుపాడు, కొవ్వూరు (మం)
నెల్లూరు జిల్లా - 524 137.

★




...జి, కార్టూనిస్ట్, కురబాలకోట-517 350, చిత్తూరు - జిల్లా.